18 వ వసంతంలోకి

సూర్య


www.suryaa.com

గ్రేటర్ హైదరాబాద్

గురువారం 31 అక్టోబర్ 2024 పేజీలు 9







అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి

# అందుబాటులోకి తీసుకురావాలి

**చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



కూకట్ పల్లి మేజర్ న్యూస్ :కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని ఐడీఎల్ (రంగధాముని చెరువు) అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసే విధంగా పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఎల్ చెరువు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు అభివృద్ధి పనుల్లో భూములు కోల్పోతున్న రైతులను పిలిచి వారికి తగిన నష్ట పరిహారం ప్రభుత్వం ద్వారా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. గత కొంత కాలంగా తమ భూముల్లో నుంచి పైప్ లైన్ పనులకు, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ పనులకు అడ్డు తగులుతున్న రైతులు భయపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం నష్ట పరిహారం కింద భూములు కోల్పోతున్న వారికి టిడీఆర్ ఇస్తుందని అది ఇప్పించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. సుమారు రూ.19 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో గత ప్రభుత్వ హయాంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. కొంత మేరకు పనులు పూర్తి కాగా మరి కొంత మేర పనులు పెండింగ్ లో ఉండటంతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. ఐడిఎల్ చెరువు పనులు పూర్తిగానే చెరువు ప్రాంతం చుట్టు ప్రక్కల వారికి ఆహ్లాదం అందించడంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, వ్యాయమం చేసుకునేందుకు ఉపయోగ కరంగా ఉంటుందని తెలిపారు. పనులు త్వరగా పూర్తి అయ్యేందుకు స్థానికులు కూడా అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ లతో పాటు మున్సిపల్, ఇరిగేషన్, హుడా విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## జాగ్రత్తలతో దీపావళి ఆనందంగా జరుపుకోండి : డిసిపి రష్మీ పెర్మల్



హైదరాబాద్ న్యూస్ సిటీ బ్యూరో : ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని, ఉత్తర మండలం డీసిపీ రష్మీ పెరుమాళ్ సూ చించారు. ప్రధానంగా కాటన్ దుస్తులు ధరించి టపాసులు కాల్చాలన్నారు. చిన్నారులకు బాంబులు..రాకెట్ల వంటి వాటికి దూరంగా ఉంచాలన్నారు. అట్లాగే టపాసులను ఆరు బయట మాత్రమే కాల్చాలని..కాల్చిన వాటిని ఎక్కడపడితే అక్కడ పడేయకుండా నీళ్లతో కూడిన బకెట్లలో వేయడం ద్వారా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అట్లాగే టపాసులను నివాసాలకు దూరంగా ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే విక్రయించాలని.. నిబంధనలను ఉల్లఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా డీసీపీ కార్యాలయం ఆవరణలో జోన్ పరిధిలోని ఏసీపీలు సర్దార్ సింగ్, సుబ్బయ్య, కృష్ణమూర్తి మరియు నార్త్ జోన్ ఇన్స్పెక్టర్ లతో కలిసి ఫ్లవర్ క్రాకర్స్ కాల్చారు.









# కాస్‌బాగ్ వీధుల్లో పర్యటించిన కార్పొరేటర్





హయత్ నగర్, మేజర్ న్యూస్: హయత్ నగర్ పాత గ్రామం కాస్ బాగ్ లో దాదాపు సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి కావడంతో మిగిలి ఉన్న వీధుల్లో కూడా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని మంగళవారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అధికారులతో కలిసి కాస్ బాగ్ విధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హయత్ నగర్ పాత గ్రామం పలు వీధుల్లో భూగర్భ డ్రైనేజ్ నూతన పైప్ లైన్ నిర్మించడంతో ఆ వీధుల్లో ఉన్న రోడ్లు ధ్వంసమై బస్తీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాస్ బాగ్ లో మిగిలి ఉన్న విధుల్లో కూడా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, డీఈ దామోదర్, ఏఈ హేము నాయక్, వర్క్ ఇన్?స్పెక్టర్ సురేష్, డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న టి.ఎన్.జి.ఓస్.నేతలు



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు,టి.ఎన్.జి.ఓస్.యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో సోమవారం రెడ్‌హిల్స్‌లోని ప్రభుత్వ ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్,కస్తూరి వెంకట్,కె.శ్రీకాంత్,బి. శంకర్,కె.ఆర్. రాజ్‌కుమార్,కె.శ్రీనివాస్,ఖాలేద్,మహ్మద్ వహీద్,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 600 మంది రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ మనిషికిక ఎంత డబ్బు ఉన్న తిండి లేకుండా ఉండలేడని,క్యాన్సర్ మహామ్మారితో ఆసుపత్రిలో చికిత్సకోసం సుదూర ప్రాంతాలనుంచి రోగుల సహాయకులకు ట్రస్ట్ తరపున ఎస్.ముజీబ్‌హుస్సేనీ మానవతాధృక్పథంతో స్పందించి,అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరం చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు.

## నగర ప్రజలకు దీపావళి పండగ శుభాకాంక్షలు

**జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**



హైదరాబాద్, మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి):దీపావళి పండుగ సందర్భంగా హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నగర ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలియజేసారు. చీకటిలోనూ వెలుగులు నింపుకొనే, ఆత్మ విశ్వాసానికి, చెడు మీద మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి అని పేర్కొన్నారు.ఈ పండగ నగర ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులను, ఆనంద కాంతులను, అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ప్రజలు పండుగను పర్యావరణాన్ని కాపాడుతూ, అన్ని జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా జరుపుకోవాలన్నారు. ఆత్మీయత, స్నేహభావంతో కుటుంబ సభ్యులతో కలిసి పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. నగరం మరింత అభివృద్ధి బాటలో పయనించేలా ప్రజలు పూర్తి సహకారాన్ని అందించాలని ఆమె విజ్ఞప్తి చేసారు.

## దీపావళి పండుగ శుభాకాంక్షలు

**జిహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి**



హైదరాబాద్, మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి):దీపావళి పండుగ సందర్భంగా నగర ప్రజలకు డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ చెడు మీద మంచి సాధించిన విజయాన్ని సూచిస్తుందన్నారు.ఈ పండుగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అష్ట ఐశ్వర్యాలు, సకల శుభాలను, ధైర్య, స్థైర్య విజయాలను, సిరిసంపదలను, సుఖ సంతోషాలను ఎల్లవేళలా ప్రసాదించాలని ఆమె కోరారు. ప్రజలు పండుగను సంతోషంగా, సురక్షితంగా జరుపుకోవాలన్నారు. ప్రకృతి, ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ కాలుష్య రహితంగా పండుగ జరుపుకోవాలని ఆమె విజ్ఞప్తి చేసారు.

## ప్రజల జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలి

**నియోజకవర్గ ప్రజలకు పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ దీపావళి శుభాకాంక్షలు**



శేరిలింగంపల్లి,మేజర్ న్యూస్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతికి దీపావళి పండుగ ప్రతిబింబంగా నిలుస్తుందన్నారు. ఈ పండుగను ప్రజలందరూ జాతి, కుల, మత, వర్గ విభేదాలు లేకుండా జరుపుకుంటారన్నారు. నరకాసురుడనే రాక్షసుడి బారి నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని, వారి జీవితాల్లో వెలుగులు నిండాయని, దానికి సూచకంగా ప్రజలందరూ దీపావళిని జరుపుకుంటారని తెలిపారు. ప్రజల జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలని తాను కోరుకుంటున్నానని అన్నారు. దీపావళి పండుగను ప్రజలు జాగ్రత్తలను పాటిస్తూ జరుపుకోవాలని సూచించారు.

## ప్రోటోకాల్ గురించి ఎమ్మెల్యే పద్మారావు కాంగ్రెస్ కార్యకర్తల గురించి మాట్లాడిన మాటలను ఖండిస్తున్నాము కాంగ్రెస్ నాయకుడు మాదిరెడ్డి జలంధర్ రెడ్డి



సీతాఫలమండి, మేజర్ న్యూస్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రోటోకాల్ గురించి ఎమ్మెల్యే పద్మారావు కాంగ్రెస్ కార్యకర్తలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాము. మీ ప్రభుత్వం లో లేని ప్రోటోకాల్ ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని ఎమ్మెల్యేను అడుగుతున్నాను. మీ ప్రభుత్వంలో సికింద్రాబాద్ నియోజకవర్గంలో మీ కుమారులు ప్రతి ప్రభుత్వ కార్యక్ర మంలో స్టేజి మీద కూర్చోబెట్టడం డివిజన్‌లో కార్పొరేటర్ ను వెనుకకు నెట్టిన సందర్భాన్ని మరిచిపోయారా అని అడుగుతున్న మా కాంగ్రెస్ కార్యకర్తలు ఎక్కడ కూడా ప్రోటోకాల్‌ను బ్రేక్ చేయలేదు. మేము మీరు చేసే కార్యక్రమానికి అడ్డుపడలేదు. అటువంటప్పుడు ప్రోటోకాల్ వివాదం ఎందుకు వచ్చిందో ఎమ్మెల్యే చెప్పాలి. ఏదైనా విషయం పూర్తిగా తెలుసుకొని మాట్లాడితే బాగుంటుంది ఎదో నోటికి వచ్చినట్లు ప్రభుత్వ అధికారులను బీఆర్ఎస్ కార్యకర్తలను అన్నట్లుగా కాంగ్రెస్ కార్యకర్తలను అంటే ఊరుకునే ప్రసక్తే లేదని తెలియజేస్తూ కాంగ్రెస్ కార్యకర్తలపై మాట్లాడిన మాటలను వెనక్కు తీసుకోవలెనని కాంగ్రెస్ కార్యకర్తలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాము. మళ్ళీ ఒకసారి కాంగ్రెస్ కార్యకర్తల జోలికి వస్తే ఖబడ్దార్ అని తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సికింద్రాబాద్ నియోజకవర్గం కార్యకర్తలు అభిషేక్, పాపాలాల్, ప్రతాప్ కుమార్, శంకర్ రావ్, చంద్రమోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ దీపావళి అష్టైశ్వర్యాలు సిద్ధింప చేయాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : హిందువులు జరుపుకునే పెద్ద పండుగలో దీపావళి ఒకటి అని ఈ దీపావళి ప్రతి ఒక్కరి ఇంట నిత్యం వెలుగులు నింపి అష్టైశ్వర్యాలును సిద్ధింప చేయాలని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీత చంద్రశేఖర్ యాదవ్ కోరారు. దీపావళి పర్వదినోత్సవం సందర్భంగా ఆమె మౌలాలి డివిజన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...చెడుపై మంచి,దుష్ట శక్తిపై దైవశక్తి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండగను జరుపుకుంటారన్నారు. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా టపాసులు కాల్చుకునే ఈ పండుగ ఆనందమయం కావాలని, శ్రీ మహా లక్ష్మి ఆశీస్సులతో మీ అందరికి సకల శుభాలు కలుగజేయాలని కోరుతూ దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

## స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ తైక్వాండో సెలెక్షన్‌లో సిల్వర్ పతకాన్ని సాధించిన కె. సుశాంత్



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః గద్వాల్-జోగులాంబ జిల్లాలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ తైక్వాండో సెలెక్షన్ -2024-2025 64 కిలోల కెటగిరి పోటీలో జియాగూడకు చెందిన కె. శ్యామ్‌సుందర్ తనయుడు,జియాగూడ కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న కె. సుశాంత్ (సాయి) రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీ తన ప్రతిభను కనబర్చి, సిల్వర్ పతకాన్ని సాధించారు. అనంతరం కె. సుశాంత్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన తైక్వాండో పోటీలో తాను సిల్వర్ మెడల్‌ను సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉందని,మరోసారి తాను పోటీల్లో పాల్గొనే గోల్డ్ మెడల్‌ను సాధించి తీరుతానని ఆయన తన ధీమాను వ్యక్తంచేశారు. ఈసందర్భంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్,టీచర్లు ప్రత్యేకంగా సిల్వర్ మెడల్‌నుసాధించిన కె. సుశాంత్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

# తాగునీటి కష్టాలు తీర్చండి

**జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి**



హయత్ నగర్, మేజర్ న్యూస్ః ప్రజల తాగునీటి కష్టాలు తీర్చాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా మన్సూరాబాద్ డివిజన్ బెతస్థ కాలనీలో కొన్ని నెలలుగా తాగునీటి సరఫరా మరీ లో ప్రెషర్ వస్తుందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కాలనీలోని తాగునీటి సరఫరాను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లో తాగునీటి సరఫరా లో-ప్రెషర్ సమస్య తీవ్రంగా ఉందని, దీపావళి పండుగ నేపథ్యంలో తాగునీటి కొరత ఉంటే ప్రజల యొక్క అవసరాలు ఎలా తీర్చుకుంటారని హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహారించడం సరైంది కాదని మండిపడ్డారు. హిందువుల పండుగలకు ఒక విధంగా ఇతర మతాలకు సంబంధించిన పండుగలకు సకల సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తున్న ప్రభుత్వం, అధికారులు హిందువుల మనోభావాలపై చిన్నచూపు చూడడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. డివిజన్లో తాగునీటి సమస్యను వెంటనే అధికారులు తగిన చర్యలు చేపట్టి సమస్యను తీర్చవలసిందిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పృథ్వీరాజ్, ధన్ రాజ్, వెంకటేశ్వర్లు, జనార్దన్ రెడ్డి, విజయవేణి, కుమారి, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎన్‌యూ ఆధ్వర్యంలో హైపర్‌టెన్షన్ క్లినిక్ ప్రారంభం

## నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు






హైదరాబాద్, మేజర్ న్యూస్: ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) హైటెక్ సిటీ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా కొత్తగా హైపర్‌టెన్షన్ క్లినిక్ ప్రారం భించారు. అధిక రక్తపోటుకు, దీర్ఘకాల మూత్రపిండాల వ్యాధికి, గుండె సమస్యలకు సంబంధంపై అవగాహన కల్పించేందుకు ఈ హైపర్ టెన్షన్ క్లినిక్ ఒక కీలక ముందడుగు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న రోగుల జీవన నాణ్యతను పెంచడం,అది నియంత్రణలో లేకపోవడం వల్ల వచ్చే మూత్రపిండాల సమస్యలు, ఇతర ప్రమాదాలను తగ్గించడం ఏఐఎన్‌యూ హైటెక్ సిటీ శాఖ లక్ష్యం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తెలిపిన ప్రకారం, అధిక రక్తపోటు ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మందికి పైగా ప్రజలను ప్రభావితం చేస్తుంది. దీని లక్షణాలు త్వరగా బయటపడవు కాబట్టి చాలామందికి అది ఉందని తెలియదు. హైపర్‌టెన్షన్ క్లినిక్ ప్రారంభం సందర్భంగా.. ఏఐఎన్‌యూ హైటెక్ సిటీ శాఖ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్టు డాక్టర్ దీపక్ రాగూరి మాట్లాడుతూ, "ఈ రోజుల్లో వైద్యంలో అత్యంత ఆందోళనకరమైన, సవాలుతో కూడిన అంశం జీవనశైలి వ్యాధుల పెరుగుదల. అధిక రక్తపోటు కూడా అలాంటి సమస్యే. ఇటీవలి కాలంలో ఇది బాగా పెరిగిపోతున్న విషయం మనం గమనిస్తున్నాం. ప్రారంభదశలోనే దీని నిర్ధారణ జరిగి, తగిన చికిత్స అందిస్తే..రక్తపోటు ఎక్కువ కాకుండా చూసుకోవచ్చు. అది ఎక్కువ కాలం పాటు కొనసాగితే మూత్రపిండాలు దెబ్బతింటాయి. "హైపర్ టెన్షన్ క్లినిక్" వెనుక ఉన్న ఆలోచన ఏమిటంటే, ముప్పు పొంచి ఉన్న ప్రజలకు రక్తపోటు విషయంలో పరీక్షలు చేయడం, ముందుగానే నిర్ధారించి,వారికి తగిన చికిత్స అందించడం. అనియంత్రిత రక్తపోటు వల్ల ప్రమాదాలలో ఒకటి మూత్రపిండాల నష్టం అని ప్రజలకు అవగాహన కల్పించాలని మేము భావిస్తున్నాము. ఇది చాలా మందికి తెలియదని చెప్పారు. ఏఐఎన్‌యూ హైటెక్ సిటీ బ్రాంచి సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టు డాక్టర్ కె. క్రాంతికుమార్ మాట్లాడుతూ, "హైపర్ టెన్షన్ క్లినిక్స్ అనేది సమాజంలో హైబీపీ ముప్పును ఎదుర్కోవడానికి ఉద్దేశించిన ఒక కార్యక్రమం. ఇది ప్రారంభదశలోనే రోగ నిర్ధారణ, రక్తపోటుతో సంబంధం ఉన్న సమస్యలను నివారించడంపై దృష్టి పెడుతుందన్నారు. మూత్రపిండాలపై హైపర్‌టెన్షన్ ప్రభావాలను ఆయన వివరిస్తూ, "ప్రతి ఇద్దరు పెద్దలలో ఒకరికి అధిక రక్తపోటు ఉంటోంది. మూత్రపిండాల శాశ్వత వైఫల్యానికి అధిక రక్తపోటు రెండో ప్రధాన కారణం. బీపీ వల్ల మూత్రపిండాలలో రక్త నాళాలు సంకోచించి సంకుచితం అయిపోతాయి. దీనివల్ల రక్త ప్రవాహం తగ్గుతుంది, మూత్రపిండాల వడపోత పనితీరు దెబ్బతింటుంది. ఇది శాశ్వత నష్టానికి దారితీస్తుంది. అధిక రక్తపోటు వల్ల కలిగే మూత్రపిండాల వ్యాధిని తెలుసుకోవడానికి రెండు సాధారణ పరీక్షలు చేయాలి. మీ మూత్రపిండాలు మీ రక్తాన్ని ఎంత బాగా ఫిల్టర్ చేస్తాయో తెలుసుకోవడానికి రక్త పరీక్ష. సీరం క్రియాటినిన్, లేదా ఈజీఎఫ్ఆర్ పరీక్ష. అల్బుమిన్ కోసం తనిఖీ చేయడానికి మూత్ర పరీక్ష. అల్బుమిన్ ఒక ప్రోటీన్, ఇది మూత్రపిండాలు దెబ్బతిన్నప్పుడు మూత్రం లోకి వెళుతుందని వివరించారు. అధిక రక్తపోటు వల్ల మూత్రపిండాల వ్యాధి రాకుండా లేదా కనీసం కాస్త తగ్గేలా చేయాలంటే రక్తపోటు తగ్గించడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడమే మంచి మార్గం. ఈ దశలో రోజుకు 30 నుంచి 45 నిమిషాల నడక, ఆరోగ్యకరమైన బరువు ఉండేలా చూసుకోవడం, ధూమపానం మానేయడం, ఒత్తిడిని నివారించడం, తక్కువ ఉప్పు తీసుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా మందులు వేసుకోవడం వంటివి చేయాలి. రక్తపోటును నియంత్రించడంలో తరచూ ఆరోగ్య పరీక్షలు కీలక పాత్ర పోషిస్తాయని డాక్టర్ కె.క్రాంతికుమార్ సూచించారు.

# అయ్యప్పలకు అన్నదానం మహాభాగ్యం





నిజాంపేట్ మేజర్ న్యూస్ : మాలధారణ చేసిన అయ్యప్ప భక్తులు కఠిన నియయాలతో దీక్ష చేస్తారు. ఉదయాష్టమ సంధ్యలలో స్వామికి పూజలు చేస్తూ ఏకభుక్తం తింటూ 41 రోజుల పాటు దీక్షను కొనసాగిస్తారు. ఎంతో భక్తి శ్రద్ధలతో, నియమ నిష్టలతో అయ్యప్ప మాలలు ధరించిన, అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నామని, అయ్యప్ప స్వామి దయ ఎల్లప్పుడూ మా కుటుంబ సభ్యులపై ఉండాలని కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ వేడుకున్నారు. అయ్యప్ప ఆశీస్సులతో ప్రతియేటా అయ్యప్పలకు అన్నదానం చేస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బాచుపల్లి బ్రదర్స్ గా పేరొందిన 17వ వార్డు కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్,16వ వార్డు కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ స్వామి బాచుపల్లి
శివాలయంలో గత 17 సంవత్సరములుగా అయ్యప్ప మాల వేసుకుని ప్రతి సంవత్సరం 41 రోజులు దీక్షలో ఉంటూ ప్రతిరోజు ఎందరో స్వాములకు మధ్యాహ్నం అన్న ప్రసాదము, సాయంకాలం స్వామిలు అందరికి అల్పాహారం అందిస్తున్నారు. బుధవారం ఆగం రాజు, ఆగం పాండు ముదిరాజ్ స్వామి వారి అన్నదాన కార్యక్రమం ఆగం వై పాండు స్వహహస్తాలుతో అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాదం అందించి, అన్నప్రసాధ కార్యక్రమాన్ని ప్రారంభించినారు.

## పంచశీల స్కూల్లో ఘనంగా దీపావళి పండుగ వేడుకలు




కూకట్ పల్లి మేజర్ న్యూస్ : కూకట్ పల్లి నియోజకవర్గం మూసా పేట లోని పంచశీల స్కూల్ లో బుధవారము దీపావళి పండుగ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు మట్టి ప్రమిదలు తాయారు చేస్కోని వచ్చి ,బొమ్మల కొలువు ప్రదర్శించటం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ మట్టి ప్రమిదలలో దీపం వెలిగించే విశిష్టతను, దీపావళి పండుగ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ముగిసిన వేలం ప్రక్రియ



కర్మన్ ఘాట్, మేజర్ న్యూస్ :కర్మన్ ఘాట్ ధ్యానంజనేయ స్వామి ఆలయంలో కొబ్బరి కాయలు, పూజా సామగ్రి అమ్ముకొను హక్కునకు బుధవారం దేవాదాయ శాఖ రంగా రెడ్డి జిల్లా సహాయ కమీషనరు, టి. శేఖర్ పర్యవేక్షణలో సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలము నిర్వహించారు. ఐదుగురు పాటదారులలో ఏ. రవి అను వ్యక్తి రూ.1,01,50,000/-లు హక్కును దక్కించుకొన్నారు. బహిరంగ వేలము షరతుల ప్రకారముగా హెచ్చుపాటదారుడు పాట మొత్తములో 50 శాతము సొమ్మును దేవస్థానమునకు వెంటనే చెల్లించి రశీదును పొందినారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి యన్. లావణ్య, సిబ్బంది లక్ష్మీ కాంత రావు, వేణు గోపాల్, రమాదేవి దేవస్థాన మాజీ సిబ్బంది , బి శ్రీనివాస రావు, పి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంట ఆనంద దీపాలు వెలగాలి..



**గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు**

కూకట్ పల్లి మేజర్ న్యూస్ :లక్ష్మీనారాయణ అనుగ్రహంతో శేరిలింగంపల్లి నియో జకవర్గం ప్రజలందరికీ శుభం చేకూ రాలని.. సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు తెలిపారు. దీపావళి సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం భాస్కరరావు మాట్లాడుతూ చీకటి మీద వెలుగు, చెడు మీద మంచి, దుష్టశక్తుల మీద దైవ శక్తి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని పేర్కొన్నారు. అదేవిధంగా దీపావళి పండుగను సుఖ సంతోషాలతో కుటుంబ సభ్యుల మధ్య ఆనందదాయకంగా పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. దీపావళి సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని ప్రజలందరి జీవితాలు శోభాయమానంగా వెలుగొందాలని, ప్రతి ఇంటి ఆనంద కాంతులు విరజిల్లాలని భాస్కరరావు ఆకాంక్షించారు.

# లైబ్రరీ సందర్శన



ముషీరాబాద్ మేజర్ న్యూస్ : గ్రంథాలయ అభివృద్ధి కమిటీని ఏర్పర్చిన గ్రంథాలయ పర్సన్ ఇంచార్జ్ సార్ పలని కదిరి వన్ ఐఎస్ అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ ఆదేశాలతో అభివృద్ధి కమిటీ మెంబర్స్ సిటీ సెంటర్ లైబ్రరీలో వివిధ సెక్షన్లను పరిశీలించి అక్కడున్న సమస్యలను పరిష్కరించే మార్గం దిశలో పనిచేయడం కొరకు గ్రౌండ్ లెవెల్ లో పరిశీలన చేశారు ఈ కార్యక్రమంలో సభ్యులు గ్రేడ్ వన్ లైబ్రేరియన్ చంద్రకళ గ్రేడ్ వన్ లైబ్రరీ సుబ్బలక్ష్మి శుక్లా దేవి ప్రతిభా రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి సుఖేష్ వెంకటేష్ యాదవ్ అవినాష్ కృష్ణారెడ్డి బొల్లం మహేందర్ హరిబాబు వరప్రసాద్ మహేష్ శ్రీనివాసు పిడి మహేష్ అనిల్ యాదమ్మ లైబ్రరీలో ఉన్న వివిధ సెక్షన్లను పరిశీలించి క్లీన్ గా ఉండేటట్టుగా చేశారు ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ సభ్యులను పర్సన్ ఇంచార్జ్ పలని కదిరావన్ ఐఏఎస్ పద్మజ కమిటీని అభినందించారు.

**LOSS OF DOCUMENTS**

నేను, కట్టెకోల రమాదేవి W/O. కె రంగారావు R/O. H.NO:- 4-8-113/4, P.NO.26, E/P, రోడ్ నెం-3, సత్యనగర్ కాలనీ, మదర్ డెయిరీ దగ్గర, హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా.తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా బేచిరగ్ మాధారం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెం.57/Eలో 238.3 చ.గజములు కలిగి యుండి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం. 6660/2009,ద్వారా సూర్యాపేటలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయబడియుంది. అయితే బస్సులో కుంట్లూర్ నుండి హయత్‌నగర్‌కు ప్రయాణిస్తున్నప్పుడు నేను పైన తెలిపిన నా ఒరిజినల్ డాక్యుమెంట్‌లను పోగొట్టుకున్నాను. దయచేసి ఎవరికైనా దొరికితే ఈ నెంబర్ కు కాల్ చేయగలరు కాల్:- 9553558989. 8790985464

# విజయోత్సవ సంబరాలలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు



## బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



దుండిగల్ మేజర్ న్యూస్ : విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించినందుకుగాను బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదేశాల మేరకు గండి మైసమ్మలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, మిఠాయిలను తినిపించుకుంటూ ఘనంగా సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలు పేద ప్రజలను మరింత పేదరికంలోకి నెట్టకుండా ఉండాలే కానీ ప్రజలు ఎటు పోతే మాకేంటనేలా ఉండకూడదన్నారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనల్లో భాగంగా దాదాపు 18,500 కోట్ల భారాన్ని ప్రజలపై మోపమంటూ విద్యుత్ నియంత్రణ మండలికి సిఫారసు చేయడం హేయమైన చర్య అని అన్నారు. కానీ బిఆర్ఎస్ పార్టీ ఈ సిఫారసులను ప్రజాభిప్రాయ సేకరణలో తీవ్రంగా వ్యతిరేకించిందని, సామాన్యుడిపై మోయలేని భారాన్ని మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వ సిఫారసులను బిజెపి పార్టీ ఏ రోజు కూడా వ్యతిరేకించలేదని, పేద ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ బిఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, పాక్స్ చైర్మన్లు, డైరెక్టర్లు, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకురాలు, బిఆర్ఎస్ అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# 11 ఏళ్లుగా పదవిలో ఉండి సమస్యలు పరిష్కరించకుండా విద్యావేత్తపై విమర్శలు హేయమైన చర్య




- మధు యాష్కి పై వ్యక్తి గత ఆరోపణలు అర్ధరహితం
- ఎమ్మెల్యే దేవిరెడ్డి కాంగ్రెస్ నాయకుల మండిపాటు

వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃఎల్బీనగర్ నియోజకవర్గంలో 11 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న సుధీర్‌రెడ్డి రిజిస్ట్రేషన్‌ల సమస్యను పరిష్కరించకుండా కాంగ్రెస్ నేతలపై నిందల మోపడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బిఎన్‌రెడ్డినగర్ రిజిస్ట్రేషన్‌ల సమస్య విషయంలో జి.ఓ నెంబర్ 118 విషయంపై ఇటీవల మదుయాష్కి పైచేసిన ఆరోపణలు హేయమైన చర్య అన్నారు. జిహెచ్‌ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్ మాజీ కార్పొరేటర్ లు రమణారెడ్డి, ప్రకాష్, వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుట్ల నర్సింహ్మయాదవ్, బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు డివిజన్ అధ్యక్షఉలు వేణు యాదవ్, కిషోర్‌గౌడ్, బుడ్డ సత్యనారాయణ, చెన్నగోని రవి, నాయకులు డేరంగుల కృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డిలు బుధవారం వనస్థలిపురం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయం చేసే మధుయాష్కి గౌడ్ పై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చిల్లర మాటలు మాట్లాడడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. 2004లో మొదటి సారిగా ఎంపిగా గెలిచిన తరువాత మధుయాష్కి ఆస్తులు, 2005లో హుడా చైర్మన్‌గా, ఆ తర్వాత ఎమ్మెల్యే తరువాత సుధీర్‌రెడ్డి ఆస్తులెన్నో లెక్క తీయాలా ఎవరు అక్రమంగా సంపాదించారో తేలుద్దామా అని ప్రశ్నించారు. తప్పుల తడక జీఓ నెంబర్ 118 తీసుకువచ్చి కాలనీల ప్రజలను మోసం చేసింది నిజం కాదా ? అసలు విషయాన్ని తప్పుదోవ పట్టించడానికి మచ్చలేని వ్యక్తిత్వం కల్గిన మధు యాష్కి గౌడ్ పై అబద్దపు ఆరోపణలు చేయడం హేయమైన చర్య అని వారు ఖండించారు. రెవిన్యూ రికార్డులలో నిషేదిత జాబితాలో ఉన్న ఆ కాలనీ సర్వే నెంబర్లను 22 ఎ నుంచి తొలగించక పోవడం ఎమ్మెల్యే అసమర్ధత, తెలివి తక్కువ తనం అని విమర్శించారు. రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరించకపోతే ఆరు నెలల్లో రాజీనామా చేస్తానని ఐదేళ్లుగా ఇంకా పరిష్కారం చేయనిది సుధీర్‌రెడ్డి కాదా అని వారు ప్రశ్నించారు. జిఓ 118 వల్ల తమకు అన్యాయంజరిగిందని, కాలనీల ప్రజలు వచ్చి ప్లాట్లకు, ఇండ్లకు విలువ లేకుండా పోయిందని, బ్యాంక్ లోన్లు, రావడం లేదని ఆఫీసుకు వచ్చి బాధలు చెప్పుకోవడం ద్వారానే మధుయాష్కి స్పందించారని విమర్శించారు. ప్రజాప్రతినిధిగా, విద్యా వేత్తగా రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారానికి మధుయాష్కి గౌడ్ కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. రాజకీయాల్లో హుందాగా ఉండాల్సిన సుధీర్‌రెడ్డి చిల్లర మాట్లాడి పరువు తీసుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేగా మున్సిపాలిటీలో ఉద్యోగాలను పెట్టుకునే దగ్గర నుంచి అధికారుల పోస్టింగ్ ల వరకు డబ్బులు తీసుకున్న చరిత్ర ఎమ్మెల్యేది అని వారు విమర్శించారు. ఎల్బీనగర్‌లో సుధీర్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఉన్న చెరువులను మింగేసిన చరిత్ర ఆయనదన్నారు. ప్రజాప్రతినిధిగా ఉన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హుందాగా మాట్లాడాలని, మధు యాష్కిగౌడ్‌పై వ్యక్తిగత ఆరోపణలు, బెదిరింపు వాఖ్యలు చేయడం హేయమైన చర్య అని, ఈ వాఖ్యలు పునరావృతం అయితే కాంగ్రెస్ నాయకులు చూస్తు ఊరుకోమని వారు హెచ్చరించారు.

## తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన లష్కర్ జిల్లా సాధన సమితి –పవన్ కుమార్ గౌడ్



సీతాఫలమండి, మేజర్ న్యూస్: తలసాని శ్రీనివాస్ యాదవ్ కు బుధవారం రోజున తన నివాసంలో కలిసి, దీపావళి శుభాకాంక్షలు తెలిపిన లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, బాలరాజ్ యాదవ్, కృష్ణ గౌడ్, బాబురావు, శైలంధర్ తదితరులు.

## సీసీ రోడ్డును పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ వెస్ట్ కాలనీ లో రూ. 17 లక్షల నిధులతో నిర్మాణ పనులు పూర్తైన నూతన సీసీ రోడ్లను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేయాలని కోరారు. అదేవిధంగా నాణ్యతల క్యూరింగ్ పనులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డుకు ఇరువైపుల చెట్లు పెట్టి కాలనీని పచ్చని వనంలా సుందరంగా మార్చుకోవాలని కాలనీ వాసులకు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మించిన కార్పొరేటర్ ను కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, రఘు, ప్రవీణ్, రామరాజు, సంతోష్ బిరాదర్, ఉమేష్, సంతోష్, రాజు గౌడ్, కార్తీక్, వినీత్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### డాక్టర్ హెూమి జే బాబా ఆశయ సాధనకు

# ప్రతి ఒక్కరు కృషి చేయాలి

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కాప్రా,మేజర్ న్యూస్ : డాక్టర్ హెూమి జే బాబా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ హెూమి జే బాబా 115వ జయంతి సందర్భంగా ఎఎస్ రావునగర్ లో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక కార్పోరేటర్ సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్ రెడ్డితో కలిసి ఆయన పాల్గోన్ని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిసిఎంబి మాజీ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ మోహన్ రావు,కాప్రా సర్కిల్ ఉపకమీషనర్ జగన్,మాజీ కార్పోరేటర్ కొత్త రామారావు,ఎఎస్ రావునగర్ హౌజీంగ్ సోసైటీ ప్రతినిధులు సోమయ్యాచారి,సిపిఎం పార్టీ నాయకులు కొమటీ రవి,సోసైటీ ప్రతినిధులు పాల్గోన్నారు.

## దివ్వెల పండుగ 'దీపావళి' మీకు ఆనందకాంతులు నింపాలి : కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: దివ్వెల పండుగ 'దీపావళి' ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనంద కాంతులు నింపాలని వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి ఆకాంక్షించా రు. దీపావళి పురస్కరించుకుని డివిజన్ ప్రజలతో పాటుగా, మల్కాజిగిరి నియోజక వర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి ప్రతి ఇంటా కొంగొత్త కాంతులు విరసిల్లాలని ఆమె ఆకాంక్షించారు. చీకటి పై వెలుగు, చెడుపై మంచి, దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అన్నారు. ఈ దీపావళి ప్రతి ఒక్కరికి సంతోషం, సకల శుభా లు, సంపదలు, సౌభాగ్యాలు, విజయా లు కలగాలని ఆకాంక్షించారు. మీ కష్టాలన్నీ తొలిగిపోయి ఈ దీపావళి మీ అందరికీ శోభాయమానం కావాలని కార్పొరేటర్ శుభాకాంక్షలు తెలిపారు.


## వెలుగులను నింపే పండగే దీపావళి : కె.యం.ప్రతాప్





జీడిమెట్ల మేజర్ న్యూస్ : దీపావళి అంటే వెలుగు అని, మన మనసుల్లో చీకటిని పాలద్రోలి, వెలుగులను నింపే పండగే దీపావళి అలాంటి వెలుగుని పదిమందికి పంచాలని రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ అన్నారు. బుధవారం 127 రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని నందా నగర్ లో, కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో బుధవారం దీపావళి పండుగ సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, స్కూల్ మేనేజ్మెంట్ వారికి దీపావళి పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలి తప్ప విషాదాలను నింపకూడదని, విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ క్రాకర్స్ జాగ్రత్తగా కాల్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ మేనేజ్మెంట్ వారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం : కూన శ్రీశైలం గౌడ్





జీడిమెట్ల మేజర్ న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని, స్థానికంగా నెలకొన్న ప్రతి సమస్యను దశలవారీగా ప్రతి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు పలు సంక్షేమ సంఘాల నాయకులు మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలం గౌడ్ ని తన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలు ఆయనకు విన్నవించారు. వినతులు స్వీకరించిన ఆయన వాటి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం సత్వర చర్యలు తీసుకుంటామని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇంఛార్జ్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ద్వారా ప్రత్యేక నిధులు మంజూరు చేసి కాలనీలు, బస్తీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని అన్నారు. అనంతరం పలువురు పలు ఆహ్వాన పత్రికలు మాజీ ఎమ్మెల్యేకి అందజేశారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్, పలువురు నాయకులు, పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నవంబర్ 4న మూసి బాధితుల అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం



**- ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్**

హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ :మూసి బాధితుల సమస్యల శాశ్వత పరిష్కరానికి నవంబర్ 4 న ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మూసి నది పరివాహక ప్రాంతాల్లో అనేకమంది బడుగుబలహీనవర్గాలవారు అనేక దశాబ్దాలుగా గుడిసెలు వేసుకొని, ఇళ్ళు కట్టుకొని కూలినాలి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. మూసి నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చితే వారు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ దూకుడుతో మూసి బాధితులు అనేకమంది తీవ్ర భయాందోళనకు గురౌతున్నారని చెప్పారు. శాశ్వత పునరావాసం కల్పించాకే మూసి బాధితుల ఇళ్ళు కూల్చాలని డిమాండ్ చేశారు. డిపిఆర్ ప్రాజెక్టు రిపోర్ట్ తక్షణమే విడుదల, మూసి నది ప్రక్షాళనకు సమగ్ర అధ్యయనం, నిపుణుల సలహాలు సూచనలు, మూసి ప్రక్షాళనపై అఖిలపక్ష కమిటీ వేయడం వంటి డిమాండ్లపై ఈ అఖిలపక్ష సమావేశంలో చేర్చించి తీర్మానాలు చేసి, ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు. ఈ అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలతోపాటు ఇతర జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలు కూడా పాల్గొని తమ పార్టీల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు అందిస్తారని డాక్టర్ దిడ్డి సుధాకర్ వెల్లడించారు.

# డివిజన్‌లో పర్యటించిన జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్

**పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చిన స్థానిక కార్పొరేటర్ ధర్పల్లి**



కర్మన్ ఘాట్, మేజర్ న్యూస్ :ఆదర్శ డివిజన్ గా లింగోజీగూడ డివిజన్ ను తీర్చి దిద్దడమే తన లక్ష్యమని కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ లో బుధవారం ఉదయం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ తో కలిసి రాజశేఖర్ రెడ్డి డివిజన్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ లింగోజిగూడా అంబేద్కర్ చౌరస్తా నుంచి గ్లోబల్ హాస్పిటల్ వరకు గ్లోబల్ నుంచి సత్య సాయి టెంపుల్ మీదుగా రోడ్ కనెక్టింగ్ నూతన రోడ్డు, గ్రీన్ పార్క్ కాలనీ ప్రధాన మెయిన్ రోడ్ కి నిధులు మంజూరు చేయాలని కోరారు.ఎస్ ఎన్ డీ పీ పనుల ప్యాచ్ వర్క్స్ పూర్తి చేయడంతో పాటు సరూర్ నగర్ చెరువు ఇన్ లెట్, ఔట్ లెట్ లాలో ఉన్న పూడికను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే మెగా ఫంక్షన్ హాల్ వద్ద నాలా మీద నిర్మించిన రోడ్డు చిన్నగా ఉంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని నాలా బ్రిడ్జిని వెడల్పు చేయాలని కోరారు.వీటితో పాటు పలు సమస్యలను కార్పొరేటర్ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం తో పాటు రోడ్ల మరమత్తులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్పొరేటర్ తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎల్బి నగర్ డిసి సేవా ఇస్లవత్ , ఏ ఎం హెచ్ ఓ నగేష్ నాయక్, డీ ఈ కార్తీక్, ఏ ఈ విజయ్ కుమార్, నాయకులు ప్రవీణ్ రెడ్డి,సుధీర్ రెడ్డి , గౌష్, నరేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా దీపావళి వేడుకలు



జుబ్లీహిల్స్, మేజర్ న్యూస్ : శ్రీకృష్ణా నగర్ లోని శ్రీ సాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో దీపావళి వేడుకను ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాఠశాల చైర్మన్ శిరీష శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషా మీనాక్షి పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థు లు దీపావళి విశిష్టతను గురించి నాటిక, నాట్యం, ఉపన్యాసం ద్వారా తెలియజేశారు. శ్రీమతి శిరీష విద్యార్థులను ఉద్దేశించి కాలుష్య రహితంగా దీపావళి జరుపుకోవాలని, మతాబులు కాల్చేటప్పుడు జాగ్రత్త వహించాలని విద్యార్థులకు సందేశం తెలియజేశారు.




# విధి నిర్వహణలో అధికారుల సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్ ఎంసీ మూసాపేట సర్కిల్ 23 డిప్యూటీ కమిషనర్ రమేష్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ మల్లేశ్వర రావు ఈనెల 31న పదవీ విరమణ పొందు తున్న సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు తో కలిసి వారిని శాలువాతో సత్కరించి వారి సేవలను కొనియాడుతూ హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో సమర్థవంతంగా పనిచేసి పదవీ విరమణ పొందుతున్న అధికారుల సేవలు అభినందనీయమని తెలిపారు. ఉద్యోగ జీవితం నుంచి విరమణ పొందినప్పటికీ సామాజిక సేవలను కొనసాగించాలని, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కుటుంబానికి అధిక సమయం కేటాయించాలని కోరారు. ఈ మేరకు జీవితకాలంలో కుటుంబ సభ్యులతో శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ గౌడ్ బీఆర్ఎస్ నాయకులు భాస్కర్ రావు, అంజి గౌడ్, సుశీల్ కుమార్, వెంకటేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన సాగుతున్ననాలా పైప్ లైన్ పనులు



ముషీరాబాద్ మేజర్ న్యూస్ :ఆర్ టి సి క్రాస్ రోడ్స్ శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో నుండి ఎ స్ ఆర్టీ ప్రధాన దారి పై మొదలై నూతన కచ్చానాల పైప్ లైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, దాని ద్వారా స్థానికులు చాలా ఇబ్బందులు ఎదుర్కుంటునట్లు వస్తున్న ఫిర్యాదుల మేరకు బుధవారం జిహెచ్ఎంసి ఇంజినీరింగ్ మరియు వాటర్ వర్క్స్ అధికారులతోలి కలిసి పనులు జరుగుతున్న ఏరియాలో కార్పొరేటర్ ఏ.పావని పర్యటించారు. గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ పైప్ లైన్ నిర్మాణం పనుల్లో ఏర్పడ్డ అంతరాయానికి కారణాలను పరిశీలించారు.పలు చోట్ల పైప్ లైన్ ఏర్పాటులో భాగంగా స్థానికుల ఇళ్లకు మంచి నీటి సరఫరా లో నిలిచిపోవడం పై కార్పొరేటర్ గారికి అందిన ఫిర్యాదులపై స్పందించి, సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్న పలువురికి వెంటనే మంచినీటి పైప్ లైన్ లను క్రమబద్ధీకరించి, ఏధావిధిగా సరఫరా కొనసాగేలా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో
బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ జిహెచ్ఎంసి డిప్యూటీ ఇంజనీర్ గీత, ఏ ఈ, అబ్దుల్ సలామ్,వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కార్తీక్ రెడ్డి మేనేజర్ కృష్ణ మోహన్, వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్, మల్లేష్ వారి సిబ్బంది మరియు బీజేపీ డివిజన్ అధ్యక్షులు రత్న సాయి చంద్ సీనియర్ నేతలు శ్రీకాంత్,పి.నర్సింగ్ రావు,సత్తి రెడ్డి, శంకర్, సంజీవ్ రెడ్డి,సాయి కుమార్,జ్ఞానేశ్వర్, ఆనంద్ రావులి తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వాల్లో బిజెపి చరిత్ర సృష్టించాలి



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : హిమాయత్ నగర్ డివిజన్లోని రాజమహల్లా బస్తి, బూత్ నెంబర్ 2 లో బిజెపి మెంబర్షిప్ డ్రైవ్ ను చేపట్టారు. ఈ కార్యక్రమానికి బిజెపి జాతీయ ఓబీసీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని పలువురికి బిజెపి సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి చరిత్ర సృష్టించాలని ఆకాంక్షించారు. దేశం కోసం, ధర్మ పరిరక్షణ కోసం బిజెపి సభ్యత్వాన్ని ప్రజలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ నాయకులు ఓబీసీ స్టేట్ ప్రెసిడెంట్ ఆనంద్ గౌడ్,పందిర్ల ప్రసాద్ , నర్సింగ్ ముదిరాజ్ , సీనియర్ నాయకులు మల్లేష్, సుధాకర్ ,నర్సింగ్ గౌడ్ ,అర్జున్ ,సతీష్ తదితరులు పాల్గొన్నారు

# సమగ్రాభివృద్ధి కోసం సర్వే...

- నవంబరు 5 నుంచి 20 వరకు ఇంటింటికీ ఎన్యుమరేటర్లు...
- ఎటువంటి జీరాక్సులు ఇవ్వాల్సిన అవసరం లేదు : జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి




శేరిలింగంపల్లి,మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సామాజిక ఆర్థిక విద్యా ఉద్యోగ రాజకీయ కుల గణనపై క్షేత్ర స్థాయిలో నవంబరు 5 నుండి 20 వరకు ఇంటింటి సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహిస్తుందని ఇంటింటికీ వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించి వివరాలను అందచేయాలని కోరారు. నవంబరు 1 నుండి 20 వ తేదీ వరకు జోన్ వ్యాప్తంగా 1,73,066 నివాసాలలో నిర్వహించాల్సిన సమగ్ర సర్వేపై జోనల్ కార్యాలయంలో బుధవారం ఎన్యుమరేటర్లతో జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో మొత్తం 2211 ఎన్యుమరేటర్లు ఈ సర్వేను చేపట్టి ఇంటింటి నుంచి పలు వివరాలను సేకరిస్తారన్నారు. ఇందుకు గాను వచ్చే నెల 1-4 వ తేదీ వరకు ఎన్యుమరేటర్లకు సమగ్ర శిక్షణను అందించి , 5 వ తేదీ నుంచి ఇంటి వద్ద తాము అందించిన ఫార్మాట్ ద్వారా వివరాల నమోదు చేపట్టాలని జడ్‌సీ సూచించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు , ఓటరు కార్డు సహా ఇతర పత్రాలను ప్రజలు సిద్ధంగా ఉంచుకోవాలని , ఎన్యుమరేటర్లకు సమాచారం మాత్రమే ఇవ్వాలని, ఎటువంటి జీరాక్సు ప్రతులు ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేసారు. ఒక్కో ఎన్యుమరేటరు 150 ఇండ్ల నుంచి వివరాలను సేకరించాలని, ప్రతి పది మంది ఎన్యుమరేటర్లను ఒక పర్యవేక్షుడు ఉంటారని, వారి క్షేత్రస్థాయి వివరాల సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలని జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి సూచించారు. ప్రతి ఇంటిపైనా సర్వే స్టిక్కర్‌ను అతికించాలన్నారు. సర్వే పూర్తయిన అనంతరం 25 లోగా సేకరించిన వివరాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియను నిర్వహించాలన్నారు. తప్పులు లేకుండా సర్వేను పూర్తి చేసి సమగ్రమైన వివరాలను సేకరించాలని జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ ముకుందరెడ్డి , ఇతర అధికారులు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

## రావూస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు



కొండాపూర్,మేజర్ న్యూస్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గుల్‌మోహర్ కాలనీలో ఉన్న రావూస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ముందస్తు దీపావళి సంబురాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దీపావళి సంబురాల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వారు దీపాలను రంగు రంగులుగా అలంకరించి తమలో ఉన్న కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు.దీపావళి పండుగను దేశవ్యాప్తంగా జరుపుకుంటారు కనుక విద్యార్థులు పలు రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ దుస్తులను ధరించి సందడి చేశారు. దీపావళి ప్రాముఖ్యతను సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చాటి చెప్పారు. ఈ సందర్భంగా దీపావళి ప్రత్యేకత గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు రవీందర్ యాదవ్ దీపావళి శుభాకాంక్షలు



మియాపూర్,మేజర్ న్యూస్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజా ప్రతినిధులకు అధికారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు దీపావళి పండుగ పురస్కరించుకొని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి సాధించిన విజయంగా, చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందాల సిరులు కురిపించాలని చంద్రశేఖర్ ప్రసాద్ అన్నారు.

# సామాజిక ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ రంగాల్లో అవకాశాల కల్పనకే- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

సవివర సమాచార సంగ్రాహకులకు మార్గదర్శకాలను సూచించిన ఆల్వాల్ డి . సి.



ఆల్వాల్, మేజర్ న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో సామాజిక, విద్య, ఉపాధి, రాజకీయ రంగా ల్లో షెడ్యూల్డ్ కులాలు, తెగలు, బడుగు బలహీన వర్గాలవారికి అవకాశాలను మెరుగు పరిచేందుకే ఈ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే అని ఆల్వాల్ జి. హెచ్. ఎమ్. సి., ఉప -కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ఆల్వాల్ జి. హెచ్. ఎమ్. సి., కార్యాలయం లో సమావేశం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సర్వే చేపట్టెందుకు అవసరమగు మార్గదర్శకాలను ఆయన సవివర సమాచార సంగ్రహకులకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యం దేశ వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర బలహీన వార్గాలు వారు జనాభా పరంగా ఎక్కువగా వున్నా , ఆ జనాభా దామాషా ప్రకారం వారికీ సామాజికంగా విద్య, ఉపాధి,రాజకీయ రంగాల్లో అవకాషాలు కోల్పోతున్నామని ఆందోళనలో ఉన్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంతరెడ్డి,మంత్రి వర్గం వారికి ఆయా రంగాల్లో అవకాశాలు కల్పించేందుకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం 60రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి పూర్తి చేసేందుకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ ఆదేశాలమేరకు ఈ సమావేశం ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నా రు. ఇంటింటికి వెళ్లి పూర్తి సమాచారన్ని సేకరించాలని, మొదటగా వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని తదనంతరం, ఆధార్ కార్డు, దృవీకరణ పత్రాలు సర్వే కోసం ఇచ్చిన వివరాలకోసం తనిఖీ నిర్వహించి ధ్రువీకరణ చేసుకోవాలని వివరించారు. ఈ మొత్తం ప్రక్రియ పనితీరును పర్యవేక్షణ చేసే భాధ్యత సూపర్ వైజర్ లదేనని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్న సర్వే.అతీత్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే ముందు ఈ సర్వే అత్యంత ప్రామా నికంగా ఉపయోగపడనుందని, దీనివల్ల గ్రామ పంచాయతి ఎన్నికల్లో, ఎమ్. పి.టి. సి -జెడ్.పి. టి. సి. ఎన్నికల్లో పెద్దమోతం లో ఎస్. టి., ఎస్. సి.,బి.సి. వర్గాల వారికి పెద్ద మొత్తంలో అవకాశాలు దక్కే అవకాశం ఉం తుందని ఆయా వర్గాల వారు ఆశిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఎ. ఎమ్. సి. నర్సిహ్మా రెడ్డి, ఎ. ఎమ్. హెచ్. ఓ., రజని, ప్రాజెక్ట్ అధికారి మధు సుధన్ , డి. ఈ.ప్రశాంతి,సూపరింటెండెంట్‌స్వామి,ఇతరఅధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## గీతంలో ఉత్సాహభరితంగా 'రాష్ట్రీయ ఏక్తా దివస్'



హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్-లోని డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లు బుధవారం సంయుక్తంగా 'జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని' ఉత్సాహభరితం గా నిర్వహించాయి. భారతదేశ ఏకీకరణ కోసం పాటుపడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా గీతం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు ఘననివాళులు అర్పించి, జాతీయ ఐక్యతా దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఐక్యతా స్ఫూర్తికి అనుగుణంగా, విద్యార్థులు తమ సమష్టి బలాన్ని, సంఘటిత సమాజాన్ని పెంపొందించే అంకితభావానికి ప్రతీకగా 'ఐక్యతా నడక'లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నడక సంఘీభావం, పరస్పర గౌరవం ప్రాముఖ్యతను చాటిచెప్పింది.జాతీయ ఐక్యతపై దృష్టి సారించడం తో పాటు, శారీరక దృఢత్వం ప్రాముఖ్యతను కూడా గీతం నొక్కి చెప్పింది. జాతీయ సమగ్రత, వ్యక్తిగత శ్రేయస్సు కోసం, సర్దార్ వల్లభాయ్ పటేల్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి విద్యార్థులు ప్రేరణ పొందారు. ఈ కార్యక్రమంలో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పీవీ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.




# నగర ప్రజలకు దీపావళి పండగ శుభాకాంక్షలు



### జిహెచ్ఎంసి కమీషనర్ ఇలంబర్తి

హైదరాబాద్, మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి): దీపావళి పండుగ సందర్భంగా జిహెచ్ఎంసి కమీషనర్ ఇలంబర్తి హైదరాబాద్ నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ దీపాల వెలుగులు మాత్రమే కాదని, సౌభ్రాతృత్వానికి, సమానత్వానికి ప్రతీక అన్నారు. ఈ పండగ ప్రతి ఇంట్లో ఆనందం, ఆరోగ్యం, సంతోషం నింపాలని ఆయన కోరారు. చీకట్లను పారద్రోలి ఒక్కో మార్పు సాధించుకుంటూ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. నగర ప్రజలు పండుగ వేడుకను పర్యావరణ హితంగా జరుపుకోవాలని, పటాకులు కాల్చడంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందరూ తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా, సురక్షితంగా దీపావళి పండుగ జరుపుకోవాలన్నారు. నగరాన్ని స్వచ్ఛంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# కాలనీల్లో కార్పొరేటర్ మార్నింగ్ వాక్



హయత్‌నగర్, మేజర్ న్యూస్ః హయత్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో బుధవారం స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మార్నింగ్ వాక్ కార్య క్రమాన్ని నిర్వహిం చారు. హయత్ నగర్ పాత గ్రామంలో కాస్ బాగ్, ఉషోదయ కాలనీలో భూగర్భ డ్రైనేజీ మాన్ హోల్స్ చెత్త చెదారంతో నిండి మురుగు నీరు రోడ్ల పై ప్రవహిస్తూ, దుర్వాసనతో వస్తుందని, ప్రజలు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కార్పొరేటర్ మార్నింగ్‌వాక్‌లో భాగంగా సమస్యను పరిశీలించి, సిబ్బందితో భూగర్భడ్రైనేజీ మాన్‌హోల్స్‌ను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూ అండ్ ఎస్‌బీ సూపర్‌వైజర్ బాలునాయక్, బస్తీ వాసులు ఉగాది జగదీశ్, ఉగాది జంగయ్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



కాప్రా,మేజర్ న్యూస్..తమ కాలనీలో మంజూరైన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ బుధవారం చక్రిపురం శ్రీ లక్ష్మీ ఫ్రైడ్ కాలనీ వాసులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేశారు.దీంతో సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని సర్కిల్ జిహెచ్ ఎంసీ అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్,శ్రీలక్ష్మీ ఫ్రైడ్ కాలనీ అధ్యక్షులు ఆర్ సుధాకర్ రెడ్డి,ప్రధానకార్యదర్శి మామిడి జంగారెడ్డి,కోశాదికారి నర్సింహారెడ్డి,సలహాదారులు లింగా రాంచందర్,కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి,ముత్యాలు పాల్గొన్నారు.



కాప్రా,మేజర్ న్యూస్..మీర్ పేట్ హెచ్ బికాలనీ డివిజన్ పరిధిలోని మంగాపురం కాలనీలో చేపట్టీన రోడ్డు నిర్మాణ పనులను బుధవారం స్థానిక కార్పోరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని ఆయన కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ రవీంద్రసాగర్, స్థానిక నాయకులు శ్రీనివాస్ గౌడ్,కనకయ్య,జయమోహన్,కాలనీ వాసులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన సురభి రమేష్ రావు



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ ఆదిత్య నగర్ ఉపాధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సురభి రమేష్ రావు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి పండగ బాణా సంచా కాల్చే సమయంలో ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని సురభి రమేష్ రావు ఆకాంక్షించారు. ఈ దీపావళి కి ప్రజల జీవితాల్లో కోటి కాంతులు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా.. చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి ప్రతీ ఇంటా ఆనందాలను, సిరులను కురిపించాలని సురభి రమేష్ రావు కోరుకున్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు కలగాలని, ప్రతి ఇంటా ఆనంద దీపాలు వెలగాలని అభిలషించారు. మనలో నీ అజ్ఞా నాందకారాన్ని తొలగించి జ్ఞాన దీపాలు వెలిగించేదే దీపావళి.. ఈ దీపావళి పర్వదినాన ఆ ధనలక్ష్మి ధాన్యలక్ష్మిల తో మన నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని మనసారా కోరుకుంటూ ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.



పూజ రవీంద్రభారతి లో బుధవారం లక్ష్మీ పూజ నిర్వహించారు. కల్చరల్ డైరెక్టర్ డాక్టర్.మామిడి హరిక్రిష్ణ తో పాటు ఉద్యోగులు ఈ పూజలో పాల్గొన్నారు. :ముషీరాబాద్/రవీంద్ర భారతి మేజర్ న్యూస్



కండక్టర్ కె. రాములు సేవలు గొప్పవి :కండక్టర్ కె. రాములు ఉద్యోగ విరమణ చేశారు.ఇ 207873 కె. రాములు 1996 లో జీడిమెట్ల డిపో లో కండక్టర్ గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు.28 సంవత్సరాలపాటు ఆర్టీసీ కి సేవలు అందించి ముషీరాబాద్ డిపో లో ఉద్యోగ విరమణ చేశారు.రాములు ప్రయాణికుల నుండి డిపో అధికారుల నుండి మంచి పేరు తెచ్చుకున్నారు .బస్ భవన్ లో కే.రాములు ఉద్యోగ విరమణ వైభవంగా జరిగింది.రాములు దంపతులను ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.ఏ ఎల్ నారాయణ , ఎం సీ మోహన్ , నర్సింగ్ రావు , శ్రీపతి నాగరాజు ,సందీప్ ముషీరాబాద్ టీం ఉద్యోగులు పాల్గొన్నారు.: ముషీరాబాద్ మేజర్ న్యూస్

# ఆరోగ్యమే మహాభాగ్యం

- పౌష్టికాహారం తీసుకుందాం - ఆరోగ్యంగా ఉందాం
- నిత్య వ్యాయామం - ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం
- నాసా ఆసుపత్రి ప్రముఖ వైద్యులు డాక్టర్ నవీన్‌కుమార్



వనస్థలిపురం, న్యూస్ః నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలని, నిత్య వ్యాయామంతో పాటు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని నాసా ఆసుపత్రి మేనేజర్ డాక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. గత మూడు సంవత్సరాల క్రితం సమాజాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన కరోనా మహమ్మారి మనందరికి ఎన్నో గుణపాఠాలు నేర్పించిందని, అయినా కూడా మనలో కొంత మంది

ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తున్నారని ఇది మంచి పద్దతి కాదని, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో పాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే స ందర్భంగా చింతల్‌కుంటలోని నాసా ఆసుపత్రి నుంచి ఎల్బీనగర్ చౌరస్తా వరకు సీనియర్ సిటిజన్స్‌తో కలిసి వైద్యులు, వైద్య సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మెదడుకు వచ్చే పక్షవాతం ఈ రోజుల్లో ఎక్కువ అవుతుందని, కోవిడ్ తరువాత హార్ట్ ఎటాక్‌తో పాటు బ్రెయిన్ ఎటాక్ కూడా పెరిగింద న్నారు. గతంలో 60 ఏళ్లు పై బడిన వారికి వచ్చే పక్షవాతం నేడు 30 నుంచి 40 ఏళ్ల వారికి కూడా రావడం బాదాకరమన్నారు. బిసి, షుగర్, కొలెస్ట్రాల్, స్మోకింగ్,, ఆల్కహాల్, అలవాటు ఉన్నవారికి, వారసత్వంగా అలాగే ఎక్కువ స్ట్రెస్ ఉన్న వారికి ఈ ప్రమాదం వచ్చే అవకాశం ఉందని అందుకోసం ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలని, నాసా హాస్పిటల్ తరపున అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఏదేమైనా ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా సమస్య వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని డాక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. చింతల్‌కుంటలోని నాసా ఆసుపత్రిలో బ్రెయిన్ ఎటాక్ సమస్యకు అత్యాధునిక చికిత్స అందుబాటులో ఉందని, నాణ్యమైన వైద్య సేవలు అందించడం నాసా ఆసుపత్రి లక్ష్యమని ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ తెలిపారు. ఈ అవగాహన ర్యాలీలో వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీ ఈటల రాజేందర్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన వడ్డేపల్లి రాజేశ్వరరావు



కూకట్ పల్లి మేజర్ న్యూస్ :దీపావళి పండుగ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ కు వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ రాష్ట్ర ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఆ లక్ష్మీదేవి కటాక్షం అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని హిందూ బంధువులందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో ఫతేనగర్ బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్, రఘు, దుర్గాప్రసాదరావు, ప్రశాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు దుప్పట్లు నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన లైన్స్ క్లబ్ ప్రతినిధులు



కూకట్ పల్లి మేజర్ న్యూస్ :కూకట్ పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్ లో వరద బాధితుల సహాయార్థం లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఎమర్జెన్సీ గ్రాంట్ తో వరద బాధితులకు దుప్పట్లు నిత్యవసర సరుకుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ డి . కోటేశ్వరరావు, రీజినల్ చైర్ పర్సన్ వి.శ్రీనివాసరావు, సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ సురేష్ జగనేని, లయన్స్ క్లబ్ బంజారాహిల్స్, లయన్స్ క్లబ్ ఆఫ్ మెగా సిటీ ప్రతినిధులు కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, బండారి ప్రసన్న ఆంజనేయులు, పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు

# స్వరసామ్రాట్ చింతలపూడి త్రినాథరావు..!



ముషీరాబాద్,మేజర్‌న్యూస్ : శ్రీశ్యామగాయత్రి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో రేపు నవంబర్ 1న బహుముఖప్రజ్ఞావంతుడు చింతలపూడి త్రినాథరావు 'భక్తిసంగీత విభావరి'ని త్యాగరాయగాన సభలో సా.5గం.లకు నిర్వహించనున్నారు.చిల్లా శివపార్వతి( సంస్థ వ్యవస్థాపకురాలు) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గాయకుడు త్రినాథరావు70వ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.బ్యాంకింగ్ రంగంలో 'ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ' నుండి 'బెస్ట్ పీఆర్వో' అవార్డును త్రినాథరావు అందుకున్నారు.'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 'లో వరసుగా మూడుసార్లు 'బెస్ట్ ఏజీఎం' అవార్డును అందుకున్నారు.విశ్వగురు అవార్డును సాధించారు.366పాటల పల్లవులతో12గంటల పాటు నిర్విరామంగా ఆలపించి విశ్వగురు వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నారు త్రినాథరావు.ఫ్రెండిషప్ మినిస్ట్రీస్ నుండి గౌరవ డాక్టరే టును అందుకున్నారు.చింలపూడి త్రినాథరావు(70, పాలకొల్లు స్వస్తలం,ప్రస్తుతం వివేక్‌నగర్ చిక్కడపల్లిలో నివాసం).స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పదవీవిరమణచేసారు. గానం, నటనలో ప్రతిభ చూపుతూ బహుముఖ ప్రజ్ఞ చాటుతున్నారు త్రినాథరావు. 1000కి పైగా సాంస్కృతిక కార్యక్రమాల్లో త్రినాథరావు అతిథిగా హాజరయ్యారు. టీవీ,రేడియో నాటకాల్లో నటించారు.కొన్ని సినిమాల్లో అతిథి పాత్ర పోషించారు.పలు కళాసంస్థల ద్వారా ఎన్నో పురస్కారాలతో పాటు స్వరకిన్నెర, స్వర సామ్రాట్, స్వరశిరోమణి, శారదావరపుత్ర బిరుదలను పొందారు చిరునవ్వుల గాన కోవిదుడు త్రినాథరావు!

# కుల గణనలో పంచ కులాలను విశ్వకర్మలుగా గుర్తించాలి

## బిసి కమీషన్ డిప్యూటీ కమీషనర్‌కు విశ్వకర్మల వినతి



వనస్థలిపురం, మేజర్ న్యూస్ః ప్రభుత్వం చేపట్టిన కుల గణన సమగ్ర సర్వేలో కమ్మరి, వడ్రంగి, స్వర్ణ కార, కంచర, శిలా శిల్పి వృత్తులుగా గుర్తించి పంచ దాయా లందరిని విశ్వ కర్మలుగా ఆమోదించాలని, సమాజంలో మాకు మా నిష్పత్తిని రాజకీయంగా సామాజికంగా అభివృద్ధి చేయాలని విశ్వకర్మ నాయకులు కోరారు. ఈ మేరకు విశ్వకర్మ ప్రతినిధులు బుధవారం బిసి కమీషన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌ను వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో అఖిల భారత విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలె జగన్నాదం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకోజు లింగాచారి, రాష్ట్ర కోశాధికారి ఆవంచి మురళిధర్‌చారి, సలహాదారులు కనపర్తి లక్ష్మణాచారి, బొడ్డుపల్లి మాధవాచారి, డి. లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

# సంబరం..



ముషీరాబాద్ మేజర్ న్యూస్ : ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ బోర్డు కు బిఆర్ఎస్ ఇచ్చిన విజ్ఞప్తి మేరకు కరెంటు రేట్లు పెంచకుండా పెంచే నిర్ణయాన్ని ఉప సంహరించుకోవడాన్ని స్వాగతిస్తూ దీనిని బిఆర్ఎస్ విజంగా భావిస్తూ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్ లోని ఆంధ్ర కేఫ్ చౌరస్తాలో విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంచడం వల్ల పేదల పైన భారం పడుతుందని భావించిన పార్టీ అధినేతలు కేసీఆర్ కేటీఆర్ లు ముందస్తుగా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిటీ బోర్డుకు విన్నవించడం జరిగిందని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల పేదల పైన పెను భారం తగ్గిందని ఇది బిఆర్ఎస్ విజయవని ముఠా గోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జై సింహా, ముషీరాబాద్ నియోజకవర్గ డివిజన్ ప్రెసిడెంట్లు రాకేష్ కుమార్, శ్రీధర్ రెడ్డి, వల్లాల శ్యామ్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, శంకర్ ముదిరాజ్, కార్యదర్శులు శ్రీకాంత్, ఆకుల అరుణ్ కుమార్, సాయి కృష్ణ, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ముఠా నరేష్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, ఆకుల శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, కేశపురం అరుణ్, జాంగిర్, శ్రీధర్ చారి, ఎయిర్టెల్ రాజు, పాశం రవి, వంశీ, రవిశంకర్ గుప్తా, అబ్బు బాయ్, ఆనంద్, విట్టల్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికులకు ప్రత్యేక గుర్తింపు

▶▶ గత ప్రభుత్వంలో కీర్తించి దగాపడ్డ ఆర్టీసీ కార్మిక కుటుంబాలు ▶▶ సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్న కార్మికులు ▶▶ సమస్యలను పరిష్కరించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని మంత్రులకు విజ్ఞాపన పత్రం





కర్మన్ ఘాట్ ,మేజర్ న్యూస్ :ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికుల కృషి ప్రపంచ స్థాయిలో కీర్తించబడిందని, రాష్ట్ర సాధన అనంతరం సమస్యల పరిష్కారంలో ఘోరంగా విఫలమైందని ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల ఆశలు చిగురించి కుటుంబాలు బాగుపడతాయని ఆశించి న వారికినమ్మించి మోసం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పతనాన్ని చవిచూడాల్సి వచ్చిందన్నారు. కె.రాజిరెడ్డి ప్రధాన కార్యదర్శి నాయకత్వంలో డి.గోపాల్ , అడిషినల్ జనరల్ సెక్రటరి, కె.టి,రెడ్డి,టి.ఎస్.రెడ్డి జాయింట్ సెక్రెటరీ టీఎస్ ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ యు ఐ ఎన్ టి యు సి రాష్ట్ర కమిటి ఆద్వర్యంలో కార్మకుల సమస్యల పై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుదెళ్ల శ్రీధర్ బాబు లను కలిసి మెమరాండం ఇవ్వడం. జరిగింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రేస్ పార్టీ ఆర్టీసి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల మానిఫేస్టో లో పెట్టడం జరిగిందనీ గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికులను మోసం చేసిన మాజీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సంకల్పంతో కార్మికులంతా ఐక్యంగాకాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నట్లు తెలిపారు. కాంగ్రేస్ ప్రభుత్వ వచ్చి 11 నెలలు అవుతున్న ఈ ప్రభుత్వం ఆర్టీసి కార్మికుల సమస్యల పై కార్మిక సంఘాలతో కాని కార్మికులతో కాని సమావేశం ఏర్పాటు చేయక పోవడాన్ని రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖడిస్తుందన్నారు. 2019 లో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజా స్వామ్య హోక్కులను కాలరాస్తూ భారత రాజ్యాంగం కల్పించిన కార్మిక సంఘాలను అనుమతించకుండ కార్మిక సంఘాల స్థానంలో సంక్షేమ మండల్లను ప్రోత్సహించాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫేస్టోలో కార్మిక సంఘాలను అనుమతిస్తామని చెప్పి 11 నెలలు అవుతున్న ఒక్క రూపాయి ఖర్చు లేని ట్రేడ్ యూనియన్లను అనుమతించక పోవడం వలన ఆర్టీసి కార్మకులు అసంతృప్తిలోఉన్నారనివివరించారు. ఆర్టీసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ అసెంబ్లీలో బిల్ పాసు చేసి 15 సెప్టెంబర్ 2024 గెజిట్ నోటిఫికేషణ్ వచ్చింది. కాంగ్రేస్ పార్టీ ఎన్నికల మేనిఫేస్టోలో హామి ఇచ్చి ప్రభుత్వం వచ్చిన 11 నెలలో కనీసం విలీన సమస్య పైన పట్టించుకోక పోవడాన్ని కార్మికులు జీర్ణించుకోలేక పోవుచున్నారని చెప్పి వెంటనే విలీన కమిటీలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించి వెంటనే విధి విధానాలను రూపోందించాలి కోరినట్లు పేర్కొన్నారు. వెంటనే అపా యింటెడ్ డే ప్రకటించాలి 2019 సంవత్సరంలో చేసిన సమ్మె కాలంలో ఆర్టీసి కార్మికులపై అక్రమంగా పెట్టిన పోలీస్ కేసులను ఎత్తి వేయాలి చనిపోయిన కుటుంబ సభ్యల పిల్లలకు మరియు మెడికల్ అన్ ఫిట్ అయిన వారి కుటుంబ సభ్యల కు దశాబ్ద కాలం నుండి రెగ్యులర్ ప్రాతిపాధికన గతంలో ఉద్యోగాలు ఇచ్చే వారు. కానీ గత ప్రభుత్వం 2022 లో 3 సంవత్సరాలు కన్సాలిడేటెడ్ ఫేమెంట్ పైన నియామాకాలు చేపట్టినారు. కాబట్టి కన్సాలిడేట్ ఫేమెంట్ పైన కాకుండ రెగ్యులర్ ప్రాతిపాధికన నియామాకాలు చేపట్టాలని పై సమస్యలతో పాటు సంపూర్ణ ఉద్యోగ భద్రత ఇవ్వాలి మహాలక్ష్మి పథకం వలన వస్తున్న ఇబ్బం దులను తొలగించాలి బ్రీత్ ఎనలైజర్ మిషిన్ల లోపాల వలన,కండీషన్లో లేని మియన్ల వలన మత్తు పానీయాల అలవాటు లేని వారికి కూడ 200%ఎశ్రీ% వచ్చి ఉద్యోగాల నుండి తొలగిస్తూ ఇబ్దంది పెట్టే సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కోరారు.గత ప్రభుత్వంలో తీవ్రంగా నష్టపోయిన ఆర్టీసి కార్మికుల సమస్యల పరిష్కారానికి తమరు ప్రత్యేక చొరవ తీసుకొని ముఖ్యమంత్రి తో మాట్లాడి పరిష్కరించే ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి, ఐటి మంత్రి సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి గారితో మరియు రవాణా శాఖామాత్యులతో మాట్లాడి పరిష్కరించే ప్రయత్నం చేస్తామని హామీ ఇవ్వడాన్ని రాష్ట్ర కమిటీ స్వగతిస్తుందని కె. రాజిరెడ్డి ప్రధాన కార్యదర్శి పేర్కోన్నారు.

## బాణాసంచా వెలిగించేటప్పుడు

# జాగ్రత్తలు అవసరం

- లైసెన్స్ ఉన్న దుకాణం నుంచే బాణాసంచా కొనుగోలు చెయ్యాలి
- బహిరంగ ప్రదేశాల్లోనే టపాసులు వెలిగించాలి
- పెద్దవాళ్ల సమక్షంలోనే పిల్లలు టపాసులు వెలిగించాలి
- బకెట్స్‌తో నీళ్లు ఉంచుకొని బాణాసంచా వెలిగించాలి
- ఫైర్ ప్రమాదాలు జరిగితే వెంటనే 101 కో ఫోన్ చెయ్యాలి
- ఫైర్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ పి.రమేష్ గౌడ్




జుబ్లీహిల్స్, మేజర్ న్యూస్ : లైసెన్స్ ఉన్న దుకాణం నుంచే బాణాసంచా కొనుగోలు చెయ్యాలని జుబ్లీహిల్స్ ఫైర్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ పి.రమేష్ గౌడ్ సూచించారు. ఈ సందర్భంగా దీపావళి పురస్కరించుకుని బుధవారం ఒక ప్రకటన విడుదల చేసి పలు సూచనలు తెలియ జేసారు. బాణసంచా ఉండే బాక్స్ ను ఎప్పుడు మూసి ఉంచాలని, నిప్పు మండే స్వభావం కలిగిన బాణసంచాను దూరంగా ఉంచాలని, పసిపిల్లలు ను దూరంగా ఉంచాలని సూచించారు. ప్రమాదాలు నివారణకు బహిరంగ ప్రదేశాల్లో బాణాసంచా కాల్చాలని, తద్వారా ప్రమాదనివారణ కి అవకాశం ఉంటుందన్నారు. పేలకుండా మధ్యలో ఆగిపోయే టపాసులు ని తిరిగి వెలిగించకూడదని, పైకి వెలగకపోయినా లోపల మండి ఉంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందన్నారు. బాణాసంచా కాల్చేటప్పుడు ప్రమాదం జరగకుండా ముందుగా బకెట్స్ నుంచి నీరు ఉంచుకోవాలని, కుటుంబ సభ్యులందరూ ఇంట్లో టపాసులు కాల్చరాదని, బహిరంగ ప్రదేశాల్లో కాల్చేటపుడు కాటన్ దుస్తులు ధరిస్తే మందిదన్నారు. కరెంట్ వైర్ల కి, ఎండు గడ్డి ఉన్న వంటి ప్రాంతాల్లో టపాసులు వెలిగించరాదన్నారు. రహదారులపై, సమూహాలు ఉన్న ప్రాంతాల్లో బాణసంచా కాల్చరాదని, పిల్లలు టపాసులు కాల్చేటపుడు పెద్దవాళ్లు దగ్గరే ఉండాలని, టపాసులు జేబులో ఉంచుకొని ధూమపానం చేస్తే ఇటీవల అమెరికా జరిగినట్టుగానే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయనీ తెలియజేశారు. ప్రజలందరూ పండుగను సంతోషం తో చేసుకోవాలని విజ్ఞప్తి చెడారు. బనసంచా కాల్చేటపుడు ఎటువంటి ఫైర్ సంభంచిన, ప్రమాదాలు జరిగినా వెంటనే 101 కో ఫోన్ చెయ్యాలని ఫైర్ స్టేషన్ ఎస్హెచ్ఓ పి.రమేష్ గౌడ్ తెలియజేశారు.

# పేదల వైద్య సాయానికి సిద్ధం

## -ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



సీతాఫలమండి, మేజర్ న్యూస్: సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన పుష్పలత (సీతాఫలమండి), రాజేశ్వరి (వారాసిగూడా), మహమ్మద్ అన్సారి (బౌద్ధనగర్) లు అనారోగ్యం బారినపడి వైద్య సాయానికి సీతాఫలమండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆశ్రయించారు. వెంటనే ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ చొరవ తీసుకొని వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షల మేరకు విలువ జేసే ఎల్.ఓ.సీ. పత్రాలను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సమకూర్చి బుధవారం సీతాఫలమండి తన కార్యాలయంలో అందజేసారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజల వైద్యానికి అధిక ప్రాధాన్యతను కల్పిస్తామని తెలిపారు. సీతాఫలమండిలోని తమ కార్యాలయంలో ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటుందని, సికింద్రాబాద్ నియోజకవర్గంలో పేదలకు తాము అండగా నిలుస్తున్నామని తెలపారు. స్థానిక నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అయోధ్యలో 'దీపావళి' అందుకే.. : జీడి బాలచందర్ గౌడ్



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: 14 ఏళ్ళ అరణ్య వాసం తర్వాత లంకలో రావణుని సంహరించి, శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు ప్రజలు ఆనందంతో పండుగ జరుపుకున్నారని అదే 'దీపావళి' పర్వదినమని బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప కోశాధికారి జీడి బాలచందర్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ కాలనీలో గల పద్మావతి ఫంక్షన్ హాల్ లో ఆయన మాట్లాడుతూ...అయోధ్యను దర్శించుకోవడం తనకు మధురానుభూతిని నింపిందన్నారు.హిందువులు అందరి చిరకాల వాంఛ అయోధ్యలో శ్రీరాముడు విగ్రహం ప్రతిష్టాపన జరుపుకోవడమని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో గత ఏడాది అంగరంగవైభవంగా ఈ కార్యక్రమంనిర్వహించుకోవడం భారతీయులు అందరికీ గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి తాను వెళ్ళి, స్వామి వారిని దర్శించుకోవడం తనకెంతో సంతోషాన్ని నింపిందన్నారు.దీపావళి పురస్కరించుకుని ఆయన జిల్లా ప్రజలకు, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. సిరులతల్లి శ్రీలక్ష్మీదేవి కృపాకటాక్షాలు ప్రజలు అందరికి లభించాలని అందరి జీవితంలో సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆల్వాల్‌లో పలు బాణ సంచా దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు



ఆల్వాల్, మేజర్ న్యూస్ : జనవాస సమూ దాయాల్లో బాణ సంచా దుకానాలను నడుపారాదనీ చిన్న చిన్న గల్లీల్లో , పార్కుల్లో మైదాన ప్రాంతాల్లో, దుకాణాలను నడుపాలని, ఎక్కడైనా నిబంధనలకు వ్యతిరేకంగా దుకానాలను నిర్వహిస్తే కఠిన చర్యలు చేపట్టాలని, అనుకోని సంఘటన జరిగితే ఆ ఏరియా అధికారిదే భాధ్యత అని హైదరాబాద్ నగర ఇంచార్జ్ మంత్రి పొన్నం హెచ్చరికలు జారిచేసిన నేపథ్యం లో ఆల్వాల్ లో ఏర్పాటు చేసిన బానాసంచా దుకానాలను ఆల్వాల్ జి. హెచ్. ఎమ్. సి., ఉప -కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఫైర్ అధికారి వెంకన్న తో కలసి తనిఖీలూ నిర్వహించసారు. బుధవారం నిర్వహించిన ఈ తనిఖీల్లో దుకాణల నిర్వాహకులకు పలు సూచనలను ఈ చేశారు. అనుకోకుండా మంటలు చెలరేగితే వెంటనే ఆర్పేందుకు ఆక్సిజెన్ సిలిండర్ ను ఏర్పాటు చేసుకోవాలని, పోలీస్ శాఖ వారి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి వివరించారు. వారి వెంట మున్సిపల్ సిబ్బంది, శానిటేషన్ పర్యవేక్షకులు ప్రభాకర్ పాల్గొన్నారు.



కాప్రా,మేజర్ న్యూస్..కాప్రా డివిజన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి చిన్న కుమారుడు రేగళ్ల కరణ్ తేజరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న అదర్శ వృద్ధ అనాధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి వారి ఆశీస్సులను పొందారు.అనంతరం రేగళ్ల సతీష్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుండే సేవా బావాన్ని అలవర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అనాధాశ్రమ నిర్వహాకులు బాల్ రెడ్డి,మన స్నేహం కావేరి తదితరులు పాల్గొన్నారు.

## ఆల్వాల్ తోట గోపాల్ రెడ్డి నివాసంలో బొమ్మల కొలువు



ఆల్వాల్, మేజర్ న్యూస్. ఆల్వాల్ లోని తోట గోపాల్ రెడ్డి, సుజాత దంపతుల ఆధ్వర్యంలో వారి నివాసం లో బుధవారం బొమ్మలకొలువు నిర్వహించారు. దీపావళి 5 రోజుల పండుగను పురస్కరించుకొని రెండవరోజు నరక చతుర్ధశి బుధవారం రోజున బొమ్మల కొలువును ఏర్పాటు చెయ్యడం జరిగిందని, ప్రతి దీపావళి పండుగకి బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తామని, సాంప్రదాయ పద్ధతిలో గౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తోట గోపాల్ రెడ్డి తెకిపారు. బుధవారం ఆనవాయితీగా నిర్వహిస్తున్న బొమ్మల కొలువు చూపారులను అలరిస్తుంది.

## ఆల్వాల్, లక్ష్మీగణపతి ఆలయంలో పూర్తైన కార్తీక మాస ఉత్సవాల ఏర్పాట్లు



ఆల్వాల్, మేజర్ న్యూస్ : మరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం కా నా జిగూడలో కార్తీక మాస ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి తెలిపారు శుభ బుధవారం స్వామివారికి 32 ఔషధీకృత ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు శనివారం నుండి ఒకటి 12 24 ఆదివారం వరకు కార్తీక మాస ఉత్సవాలు జరుగుతాయని ప్రతి సోమవారము శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య అర్చిత గురు పరంపరాగత మహాసభ శివలింగానికి ఏకాదశ రుద్రాభిషేకం రుద్ర హొమం మహా పూర్ణాహుతి గురువుగారు చే నిర్వహించబడుతుందని తెలిపారు ఈ పూజలో పాల్గొన్న వారికి నవగ్రహ దోషాల నివారణ విద్యా వివాహ కీర్తి ఆయురారోగ్య ఐశ్వర్య సౌభాగ్య మనశ్శాంతి కలుగుతుందని తెలియపరిచారు

## 'దీపావళి' ప్రతి ఒక్కరికి శుభప్రదం కావాలి

### మేకల మోహన్ యాదవ్



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : ఈ దీపావళి ప్రతి ఒక్కరికి శుభప్రదం కావాలని, అందరి జీవనంలో మరింత సంతోషం నింపాలని బీజేపీ సీనియర్ నేత మేకల మోహన్ యాదవ్ అకాంక్షించారు. బుధవారం ఆయన మౌలాలిలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ...ఈ దీపావళితో ప్రజలందరి జీవితాల్లో కష్టాలు అనే కారు చీకట్లు పూర్తిగా తొలగిపోవాలన్నారు. కొత్త అవకాశాలతో ప్రతి ఒక్కరి జీవితంలోకి చిరు దివ్వెల వెలుగులను ఈ దీపావళి తీసుకుని రావాలని కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. ప్రజలందరూ అనునిత్యం సుఖ సంతోషాలతో గడపాలని ఆయన ఆకాంక్షించారు. చిన్నా, పెద్ద అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకునే దీపావళి పండుగను ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటిల్లిపాది ఆనందంగా దీపావళి పండుగ జరుపుకోవాలని మౌలాలి డివిజన్ ప్రజలకు, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు మేకల మోహన్ యాదవ్ శుభాకాంక్షలు అందచేశారు.



ఆల్వాల్ లో బుధవారం ఆల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల విజయ శాంతి శ్రీనివాస్ రెడ్డి వీధి దీపాల నిర్వహణ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. తమ డివిజన్ లో వీధి దీపాసలు సరిగా వెలగడం లేదని, వెంకటేశ్వరా పార్కులో ఐ మాక్స్ దీపాలను ఏర్పాటు చేయాలని అవసరం వున్నా చోట కాలనీ వాసులతో సహకారం తీసుకోని సమస్యలను పరిష్కరించాలని ఆమె అధికారులను కోరారు. ఈ కాసర్యక్రమం లో డి. ఇ. రఘుపతి రెడ్డి, ప్రసాద్, రమేష్, శ్రీ కాంత్ స్థానిక నాయకులు మల్లేష్, గౌడ్, రమేష్, మహేష్ పాల్గొన్నారు.

## 'పేద పురోహితులకు ఆదరణ ఏది?'-గుంటూరు శ్రీనివాసశాస్త్రి



ముషీరాబాద్,మేజర్‌న్యూస్ : పేద పురోహితులకు ఆదరణ ఏది? -అని పురోహితుడు గుంటూరు శ్రీనివాసశాస్త్రి (చిక్కడపల్లి) ఆవేదన వ్యక్తం చేసారు. పండుగరోజూ పస్తులు తప్పడం లేదని అన్నారు.దసరా,దీపావళి పండుగలు ఘనం .కానీ ఆ పండుగల వేళ పురోహితులకు పనిదొరకడం లేదని పేర్కొన్నారు. పూజలకు ఎవ్వరూ తమను పిలవడం లేదన్నారు.పురోహితలు సంక్షేమాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులు, కాలనీ కమిటీలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు.పురోహిత సంఘాలు పేద పురోహితలకు పనికల్పిస్తామంటూ సంఘాలు పెట్టినా వాటివల్ల పురోహితులకు ప్రయోజనాలు ఆశించిన రీతిలో లేకపోవడమే గాక పనులు వాళ్ళుఅప్పగించినా సగం వారికి కమీషన్ ఇవ్వడానికే సరిపోతుందని అన్నారు.ఇతర కులస్థులు కూడా జీవనాధారం కోసం పౌరాహిత్యాన్ని చేపట్టడం జరుగుతుందని, వారు సైతం ఏజెంట్స్‌గా మారి పురోహితులకు పనికల్పించేందుకు ముందుకువచ్చినా వాటివల్ల పురోహితులకు లాభమేమి లేదన్నారు.ప్రభుత్వాలు ఈ దిశగా చర్చలు తీసుకోవాలని, పురోహిత సంఘాలు చిత్తశుద్ధితో పేదపురోహితులకు పనులు కల్పించాలని కోరారు. టెక్నాలజీ పెరగడంతో వాట్సాప్, యూట్యూబ్‌లు చూస్తూ ఎవరికి వారే పూజలునిర్వహించుకుంటున్నారని పేద బ్రాహ్మణులకు పనులు కల్పించేందుకు చేయూత నివ్వాలని గుంటూరు శ్రీనివాసశాస్త్రి కోరారు. చిక్కడపల్లి, సికింద్రాబాద్ ...తదితర ప్రాంతాల్లో అడ్డాలపై పనులకోసం అడ్డాకూలీల్లా పేద బ్రాహ్మణులు ఎదురుచూడటం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.పేరుకు గొప్ప కానీ పనులు లేక జీవనం కష్టమవుతుందన్నారు.

## ప్రిన్సిపల్ జ్యోత్స్నప్రభ సేవలు అభినందనీయం





హయత్ నగర్, మేజర్ న్యూస్: హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. జ్యోత్స్నప్రభ సేవలు అభినందనీయమని పలువురు ప్రముఖులు ప్రశంసించారు. బుధవారం కళాశాలలో ఆమె పదవీవిరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు ప్రిన్సిపాల్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్స్, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ, ప్రస్తుత వైస్ ఛాన్సలర్స్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, బంధుమిత్రులు, కుటుంబసభ్యులు, విద్యార్థినీ విద్యా




కారాగారంలో దీపావళి 'కళ' : దీపావళిని పురస్కరించుకుని చర్లపల్లి కేంద్ర కారాగారంలో పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ టీచర్ అకాడమీ డైరెక్టర్ రేవతీప్రసాద్ ఆధ్వర్యంలో సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. -ముషీరాబాద్/రవీంద్రభారతి,మేజర్‌న్యూస్